క్లుప్తంగా

బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభం



గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవాలయంలో సోమవారం బతుకమ్మ పండుగకు ముందు 9 రోజులు నిర్వహించే బొడ్డెమ్మ వేడుకలను మహిళలు, యువతులు ఘనంగా ప్రారంభించారు.
నెల్లికుదురు: మండలంలో బొడ్డెమ్మ పండుగను సోమవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.

ఇంటిని కూల్చడం దారుణం

మహబూబాబాద్: పేద వితంతు ఇంటి నిర్మాణంను కూల్చడం దారుణమని సీపీఐ మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు పరిధిలోని తలారి వెంకటేశ్వర్లు కాలనీలో నర్సమ్మ అనే వితంతువు ఇంటి నిర్మాణాన్ని సోమవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. భారీ వర్షాలతో నర్సమ్మ ఇల్లు కూలిపోగా పునఃనిర్మాణం చేస్తుండగా అధికారులు కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని అజయ్‌సారథిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, అశోక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదార్ సోమవారం సందర్శించారు. విద్యార్థులపై నిఘా పెట్టాలని అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఏకలవ్య విద్యార్థులు



కొత్తగూడ: ఏకలవ్య గురుకులాల రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్‌లో కొత్తగూడ ఏకలవ్య గురుకుల విద్యార్థులు సత్తా చాటి వివిధ విభాగాల్లో బహుమతులతోపాటు ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్ సింగ్ సోమవారం తెలిపారు.

దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలి

మహబూబాబాద్ రూరల్: వంట నూనెల దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకాన్ని 12శాతం నుంచి గరిష్ఠంగా 32శాతానికి పెంచడం దారుణమన్నారు. సామాన్యులపై ఆర్థికభారం పడుతుందన్నారు. వంట నూనెల పెరుగుదలపై ఉన్నతస్థాయి కమిటీని నియమించి సమీక్షించాలన్నారు.

వసతులు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉన్న దేవాలయాలకు కనీస వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా దేవదాయ సెల్ జాయింట్ కన్వీనర్ సుదర్శన్‌ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సింగారపు సతీష్, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశాడు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, సర్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్య తీసుకోవాలి

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస రేషన్ డీలర్ కవితపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతాపని పుల్లయ్య, ఇనుగుర్తి ఉపేందర్, మేడి ప్రభాకర్, ఉమేష్, ఇనుగుర్తి ప్రశాంత్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు సోమవారం సీరోలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తాళ్ల సంకీస రేషన్ డీలర్ ఖమ్మంలో ఉంటున్నాడని, వినియోగదారులకు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'మెనూ పాటించడం లేదు'

మరిపెడ: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ కళాశాలలో మెనూ పాటించడం లేదని డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రిన్సిపాల్‌కు తెలిపిన ఫలితం లేదని విద్యార్థులు వాపోయారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ.. సవరణల పేరుతో కార్మిక చట్టాలను తుంగలో తొక్కే కుట్రలను మానుకోవాలన్నారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంద శంకర్, వీరవెల్లి రవి, కేతరాజు ఉప్పలయ్య, తండ శ్రీనాథ్, రాందాస్, నరేష్, శివ, బాలాజీ, సాయి పాల్గొన్నారు.

నెల్లికుదురులో..

నెల్లికుదురు: కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు అందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కార్మికులతో కలిసి సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు తిలక్ బాబు, ఎల్లయ్య, రవి, ఐలేష్, శ్రీను, యాకన్న, చాంద్ పాషా, విజయ పాల్గొన్నారు.

కురవిలో..

కురవి: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పోతుగంటి మల్లయ్య డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో బ్లాక్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రిసుధాకర్, గుగులోత్ సరోజ, మాటేటి జ్యోతి, సుజిత, హేమలత, కమలమ్మ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



నెల్లికుదురు: నిరసన తెలుపుతున్న కార్మికులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బయ్యారం: కార్మిక హక్కులను హరించేవిధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం బయ్యారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, నాయకులు పెంటయ్య, పురుషోత్తం, రవి, రామ్మూర్తి, షెలార్ పాల్గొన్నారు.

బయ్యారం: కార్మిక హక్కులను హరించేవిధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం బయ్యారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, నాయకులు పెంటయ్య, పురుషోత్తం, రవి, రామ్మూర్తి, షెలార్ పాల్గొన్నారు.

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులను సీఐటీయూ ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పేరు మార్పిడిని విరమించుకోవాలి

నెహ్రూసెంటర్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి వేమిశెట్టి కిషోర్‌కుమార్ అన్నారు. యూనివర్సిటీ పేరు మార్చడం సరికాదని జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పాండురంగ్య, మండల అధ్యక్షుడు గిరిధర్‌గుప్త, నర్సింహారావు పాల్గొన్నారు.

మరిపెడ: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును మార్చాలని చేసే ప్రయత్నం ప్రభుత్వం విరమించుకోవాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకటరామారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు తిపిరిశెట్టి గోవర్దన్, మధు, కాంతారావు, శ్రీనివాస్, హరిప్రసాద్, అనిల్, రాము పాల్గొన్నారు.

గూడూరు: పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్పిడి చేయాలనుకున్న తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండూరు ఉమామహేశ్వరరావు తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు.

దంతాలపల్లి: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు కోరారు. సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.



మరిపెడ: వినతిపత్రం ఇస్తున్న ఆర్యవైశ్యులు

జనవరి నుంచి సన్నబియ్యం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: జనవరి నుంచి తెల్లరేషన్ కార్డులు ఉన్నవారికి ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని గుర్తూరు గ్రామ శివారులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త రేషన్‌కార్డులకు అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజోపయోగ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, కొమురయ్య, సీఈఓ మురళీ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

మహబూబాబాద్ రూరల్: విద్యార్థి దశలో క్రమశిక్షణ, కష్టపడేతత్వం చాలా ముఖ్యమని డీఎస్పీ ఎస్.తిరుపతిరావు అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల వీడ్కోలు, సామాజిక అంశాలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు డీఎస్పీ చేతుల మీదుగా క్రీడా దుస్తులు, వాలీబాల్, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక, ఏఎస్సై సూరయ్య, హెచ్ఎం సక్రు, పీడీ ధరావత్ మోహన్ నాయక్, ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మీదేవి, లక్ష్మయ్య, శారద, సుదర్శన్, హన్మంతు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

వరద బాధితులను ఆదుకోవాలి

మహబూబాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీతారాంతండాలో తీవ్రనష్టం జరిగిందని, వరద బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలని బాధితులు సంపూర్ణ, నీలా డిమాండ్ చేశారు. మరిపెడ మండలం తండా ధర్మారం గ్రామ పంచాయతీ శివారు సీతారాం తండాకు చెందిన వరద బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అదేవిధంగా తండాలో డ్వాక్రా రుణాలను మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో తండా వాసులు శిరీషా, కౌసల్య పాల్గొన్నారు.

26న వాలీబాల్ క్రీడలు

పెద్దవంగర: ఈనెల 26న మండల స్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఎస్‌ఓ బుదారపు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల బాలబాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని, ఉదయం 9గంటల వరకు పాఠశాలలో రిపోర్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీలు కంచర్ల ప్రభాకర్, సురేందర్, ఉపాధ్యాయులు రాజలింగం, కర్ణాకర్, కవిరాజు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేసిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

డోర్నకల్: రైతులతోపాటు కౌలు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. స్థానిక చర్చి కాంపౌండ్‌కు చెందిన ఎడ్విన్‌రావు కొద్ది రోజుల క్రితం మృతి చెందగా సత్యవతి రాథోడ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బ్యాంక్‌స్ట్రీట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతుబంధు డబ్బు జమ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతోపాటు కౌలు రైతులను మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ ఆంగోత్ బిందు, నాయకులు మన్యుపాట్ని, బోరగళ్ల శరత్, మధు, రాంభద్రం, కొత్త వీరన్న, గౌస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో అన్యాయం చేసిన తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని బాధితులు వెంకన్న, సురేష్, రమేష్ డిమాండ్ చేశారు. కేసముద్రం మండలం మహముద్‌పట్నం గ్రామ శివారు భూక్య రాంతండాకు చెందిన పలువురు బాధితులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలోతండా శివారులో 36మంది పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి పట్టాలు ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఆ స్థలంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు పట్టాలను తహసీల్దార్ ఇచ్చి తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధితులు నరేష్, వెంకన్న, గోపాల్, నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితులు

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు



తొర్రూరు: ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న విద్యార్థులు

తొర్రూరు: ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు తలెత్తుతున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగించొద్దంటూ సోమవారం డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ, అధ్యాపకులు సువర్ణ, అన్నపూర్ణ, ఉప్పలయ్య, నర్సయ్య, శివరామకృష్ణ, మల్లయ్య, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలు మానుకోవాలి

గూడూరు: ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ విక్రయాలను మానుకోవాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను మాత్రమే ఉపయోగించాలని తహసీల్దార్ శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్థానిక వర్తక వ్యాపార సంస్థల యజమానులతో ప్లాస్టిక్ నిషేధం పై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి భీమానాయక్ పాల్గొన్నారు.

'నిరంకుశపాలన దేశానికి ప్రమాదం'

నెహ్రూసెంటర్: నిరంకుశపాలన దేశానికి ప్రమాదకరమని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.మనోహర్‌రాజు అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లిన మనుధర్మాన్ని ఆధునిక భవిష్యత్ శాస్త్రంగా తీసుకురావడం చీకటివైపు ప్రయాణమే అన్నారు. నేటి నుంచి ఈనెల 30 వరకు కుల నిర్మూలనపై ప్రచారాన్ని చేపట్టనున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వాసునాయక్, భీమానాయక్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార్ల శివరాజ్ పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

విశ్వకర్మ పథకాన్ని అమలు చేయాలి

మహబూబాబాద్: చేతి కులవృత్తుల జీవనోపాధి కోసం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, సతీష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దుప్పట్ల పంపిణీ



డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం ఆకేరు వరదతో నష్టపోయిన విద్యార్థులకు ఉపాధ్యాయురాలు శైలజ దుప్పట్లతోపాటు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రుక్మాంగధర్‌రావు, ఉపాధ్యాయులు రమేష్, స్వామి, నాగేశ్వర్‌రావు, అమీన్, సునీత, మాధవి పాల్గొన్నారు.

కొత్త రుణాలు ఇవ్వాలి

గార్ల: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.లక్ష రుణమాఫీ చేసిన రైతులకు నేటికీ కొత్తరుణం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం గార్ల రైతువేదిక భవనం ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి జి.సక్రు ఏఈఓ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు.

సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి

బయ్యారం: సోషల్ మీడియాను సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలే తప్ప విద్వేశాలు రెచ్చగొట్టే చర్యలకు ఉపయోగించరాదని గార్ల-బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి సూచించారు. సోమవారం బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో వాట్సప్ గ్రూపుల అడ్మిన్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

వసతి గృహం పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఎంపీడీఓ వివేక్‌రామ్ పరిశీలించారు.

బంక్‌పై దాడి ఘటనలో కేసు నమోదు

బయ్యారం: బయ్యారంలోని పెట్రోల్‌బంక్‌పై ఆదివారం రాత్రి జరిగిన దాడి ఘటనలో ఇరువురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంకులో డీజిల్ పోయించుకున్న బి.వినయ్‌కు సేల్స్ మెన్‌కు జరిగిన ఘర్షణలో వినయ్‌తోపాటు వంశీ బంక్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై బంక్ నిర్వాహకులు వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కరాటేలో గోల్డ్ మెడల్స్

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో శ్లోకకిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ జాస్తి ఉమాదేవి, కరస్పాండెంట్ రమణ సోమవారం తెలిపారు.

28న లోక్ అదాలత్

నెల్లికుదురు: ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఎస్సై మాట్లాడుతూ.. కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని తద్వారా సమయం, డబ్బు ఆదా చేసుకుని ప్రశాంతగా జీవించాలని ఎస్సై కోరారు.

ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్‌గా అనిల్

నెల్లికుదురు: ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్‌గా నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్న మర్రికట్ల అనిల్ కుమార్‌ను నియమిస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ సోమవారం తెలిపారు.

పోలీస్ కళాజాతా

గార్ల: బాలికలు ఆపదలో ఉన్నప్పుడు ఆత్మరక్షణ కోసం 100కు డయల్ చేయాలని గార్ల-బయ్యారం సీఐ బి.రవికుమార్ బాలికలకు సూచించారు. సోమవారం గార్లలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో షీటీం, పోలీస్ కళాజాతా బృందం సభ్యులు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై జీనత్‌కుమార్, షీటీం ఎస్సై, సిబ్బంది, హెచ్ఎం జోగయ్య పాల్గొన్నారు.

షాపుల ఎదుట వాహనాలు నిలుపరాదు

గూడూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థల ఎదుట ద్విచక్ర, ఇతర వాహనాలు నిలిపి రాకపోకలకు అంతరాయం కల్గించరాదని సీఐ కె.బాబూరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వాహనాల వద్ద ఆయన మాట్లాడారు.

నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామ శివారు పడమటి గడ్డతండా, కొత్త తండాలను కలిపి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండావాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు సోమవారం వినతిపత్రం అందించారు.

జీఓను ఉపసంహరించుకోవాలి

బయ్యారం: విద్యాశాఖలో రాష్ట్ర ప్రభుత్వం వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ పేరుతో విడుదల చేసిన జీఓను ఉపసంహరించుకోవాలని టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.భద్రునాయక్ డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు రవీందర్, రూప్లా పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తే ఎన్ఎస్ఎస్ లక్ష్యం



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్‌పై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రికి వినతి

గార్ల: ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లుగీత కార్మికులకు సైతం కాటమయ్య రక్షణ కవచాలు అందజేయాలని కోరుతూ సోమవారం ఇల్లెందుకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కల్లుగీత కార్మికులు వినతిపత్రం అందజేశారు. అలాగే గార్ల సీహెచ్‌సీకి క్యాడర్ స్ట్రెంత్ ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి వైద్యులను నియమించేందుకు కృషి చేయాలని కోరుతూ మంత్రికి డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ విన్నవించారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గూడూరు: పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ వీరస్వామి అన్నారు. మండలంలోని భూపతిపేట రైతువేదికలో సోమవారం పిల్లల ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, ఎంపీఓ సత్యనారాయణ, తీగలవేణి, అయోధ్యపురం పీహెచ్‌సీ, వైద్యులు పాల్గొన్నారు.

పరువుపోతుందని ఆత్మహత్య

తొర్రూరు: వివాహేతర సంబంధం వ్యవహారంలో పెద్ద మనుషులు పిలిపించి మాట్లాడతారనే భయంతో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన మంగళపల్లి యాకయ్య(45) పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఖమ్మం జిల్లా పాతర్లపాడుకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయమై భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టి మాట్లాడుదామని ఇరువర్గాల వారు నిర్ణయించారు. దీంతో పరువుపోతుందని భావించిన వ్యక్తి ఎవరూ లేని సమయంలో ఇంటి ముందు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత ?

గూడూరు: మండల కేంద్రంలోని మానుకోట వైపు ఎన్‌హెచ్ రహదారిలో సోమవారం సాయంత్రం ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మానుకోట మీదుగా వచ్చిన ఓ కారు స్థానిక పెట్రోల్ పంపు ఎదురుమూలపై ఆగింది. అక్కడికి సమీపంలో యువకులు క్రికెట్ ఆడుతుండగా, బంతి ఎగిరి ఆగి ఉన్న కారు సమీపంలో పడింది. బంతి కోసం వచ్చిన ఓ యువకుడు ఆగి ఉన్న కారు వద్ద హైరానా పడుతున్న ఇద్దరు వ్యక్తులు కారులోని ప్యాకెట్లు కనబడకుండా దుప్పటి కప్పడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. వెంటనే సంఘటనా స్థలం చేరుకున్న పోలీసులు ఆ కారును పోలీసు స్టేషన్‌కు తరలించి, అందులో సుమారు 100 కిలోలకు పైగా ఎండు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు స్పందించకపోగా, పెద్ద మొత్తంలో కారులో గంజాయి రవాణా అవుతుండగా పట్టుకున్నారనే విషయం చర్చనీయాంశమైంది.